1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health

Best for Readers

THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 172 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 12 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 172 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 12 May 2025 PAGES : 8 PRICE : 3/-

# పాక్ దాడిచేస్తే.. వినాశకరంగా ప్రతిస్పందిస్తాం



## జేడీ వాన్స్‌తో మోదీ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 11)

భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ వీటికి ముగింపు పలికేందుకు తాము మధ్యవర్తిత్వం వహిస్తామంటూ అమెరికా ముందుకొస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల సంప్రదింపులు జరిపారనే వార్తలు వచ్చాయి. ఆ క్రమంలో పాకిస్థాన్ ఒకవేళ దాడి చేస్తే ప్రతిస్పందన అత్యంత దారుణంగా, వినాశకరంగా ఉంటుందని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది. ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చితే పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తుందని ప్రధాని మోదీతో జేడీ వాన్స్ పేర్కొన్నట్లు తెలిసింది. దీనికి మోదీ బదులిస్తూ.. పాకిస్థాన్ ఎటువంటి దాడులు చేయకుంటే తాము కూడా సంయమనం పాటిస్తామని చెప్పినట్లు సమాచారం. "ఒకవేళ పాకిస్థాన్ ఏదైనా చేస్తే.. ప్రతిస్పందన అత్యంత దారుణంగా, వినాశకరంగా ఉంటుంది" అని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది. అయితే, అదే రోజు రాత్రి భారత్‌లోని 26 ప్రదేశాలపై పాకిస్థాన్ దాడులు చేయగా.. వాటన్నింటినీ భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. అనంతరం పాక్ వైమానిక కేంద్రాలపైనా భారత్ విరుచుకుపడింది. దీంతో కాల్పుల -మిగతా 2లో

## బ్రహ్మోస్ దెబ్బకు.. బెదిరిన పాక్ వాయుసేన స్థావరాలు



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 11)

పాకిస్థాన్ అధికారిక రాజధాని ఇస్లామాబాద్ అయినా.. పాలన మొత్తం జరిగేది రావల్పిండి నుంచే. ఇక్కడ చక్లాలాలో ఆర్మీ చీఫ్ ఆఫీస్ నుంచే ఆదేశాలు వెళుతుంటాయి. శనివారం తెల్లవారుజామున పాక్‌లోని ఈ కుంభస్థలాన్నే భారత్ లక్ష్యంగా చేసుకొని దాడులు చేసింది. ఇక్కడ పాక్ వాయుసేనకు చెందిన మొబిలిటీ కమాండ్ ఉంది. దీంతోపాటు గగనతల రిఫ్యూలర్ ట్యాంకర్ ఫ్లైట్లు, హెవీ లిఫ్టర్లు ఇక్కడ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముందు రోజు అర్ధరాత్రి పాక్ దుందుడుకు చర్యలకు ప్రతిగా భారత్ తెల్లవారుజామున అత్యాధునిక క్షిపణులు, గైడెడ్ మ్యూనిషన్, లాయిటరింగ్ మ్యూనిషన్‌ను వాడినట్లు తెలుస్తోంది. వీటితో రఫీక్, మురీద్, చక్లాలా, రహీంయార్ ఖాన్, సుక్కుర్, చునియన్. పర్సూర్, సియాల్‌కోట్ స్థావరాలపై మన యుద్ధ విమానాలు దాడులు చేశాయి. ఇందులో వైమానిక స్థావరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రాడార్ సైట్లు, ఆయుధ నిల్వ కేంద్రాలున్నాయి. భారత్ వాడిన వాటిల్లో హ్యామర్ గైడెడ్ బాంబులతోపాటు.. స్కాల్ప్ క్షిపణే కాకుండా.. బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూజ్ మిసైల్ ఉండే అవకాశాలున్నాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనంలో పేర్కొంది. యుద్ధ రంగంలో దీనిని ఉపయోగించడం ఇదే తొలిసారి కావొచ్చని పేర్కొంది. కాకపోతే.. అధికారిక వర్గాల నుంచి దీనిపై ఎటువంటి ధ్రువీకరణ లేదని పేర్కొంది. భారత్ నిమిషాల వ్యవధిలో పాక్‌కు చెందిన కీలక వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడం ఆ దేశంలో గుబులు రేపింది. అయితే.. యూపీలో ఈ క్షిపణి తయారీ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్‌లో భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించిందని వెల్లడించారు. ఆ సమయంలో ఈ క్షిపణులకున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. దీని ప్రభావం గురించి తెలియని వారెవరైనా ఉంటే.. పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. -మిగతా 2లో

## చైనా అధునాతన క్షిపణి గుట్టు భారత్ చేతిలో..

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 11)

భారత్‌లోని లక్ష్యాలపై దాడి చేయడానికి చైనా తయారీ పీఎల్-15 దీర్ఘశ్రేణి క్షిపణిని ఉపయోగించామని పాకిస్థాన్ వాయుసేన అంగీకరించింది. గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల ఈ అస్త్రాన్ని యుద్ధంలో వాడటం ఇదే మొదటిసారి. పీఎల్-15 క్షిపణి శకలాలు పంజాబ్‌లోని హోశియార్‌పుర్ సమీపంలో పడ్డాయి. ముఖ్యంగా ఒక అస్త్రం దాదాపుగా చెక్కుచెదరని విధంగా లభ్యమైంది. భారత భద్రతా దళాలు దీన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఇప్పుడు దీన్ని విడగొట్టి.. ఈ అస్త్రంలో వాడిన పరిజ్ఞానాల గుట్టును భారత్ ప్రత్యక్షంగా తెలుసుకోనుంది. ఈ నెల 7న ఉగ్రస్థావరాలపై భారత్ దాడులకు దిగాక పాకిస్థాన్ తన జె-10, జేఎఫ్-17, ఎఫ్-16 యుద్ధవిమానాలను గగనతలంలోకి పంపింది. ఈ క్రమంలో సరిహద్దుల్లో భారత జెట్‌లపైకి ఎల్-15ఈ క్షిపణిని ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఇది చైనా రూపొందించిన ఆయుధాల్లో అత్యంత అధునాతన బియాండ్ విజువల్ రేంజ్ (బీవీఆర్) క్షిపణి. వీటి సాయంతో రఫేల్, సుఖోయ్-30ఎంకేఐ వంటి భారత యుద్ధవిమానాలను కూల్చినట్లు పాక్ చెప్పుకొంది. అందులో వాస్తవం లేదని ఆ తర్వాత వెల్లడైంది.



## మే 12న హాట్‌లైన్‌లో భారత్-పాక్ చర్చలు

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 11)

భారత్-పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్‌లు పాల్గొననున్నారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్త వాతావరణం తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్ డీజీఎంవోతో పాకిస్థాన్ డీజీఎంవో హాట్ లైన్‌లో మాట్లాడారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రతిపాదించి.. వెంటనే అమలు చేద్దామని కోరారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చిందని భారత్ తరపున విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. మరోవైపు కాల్పుల విరమణ ప్రకటించిన కొన్నిగంటల్లోనే పాక్ సైన్యం ఉల్లంఘించింది.



## మురళీ నాయక్ కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.50 లక్షల ఆర్థిక సాయం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 11)

దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాను మురళీనాయక్‌కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు వెళ్లి జవాను భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. మురళీనాయక్ తల్లిదండ్రులను ఆయన ఓదార్చారు. కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉంటాయని భరోసా కల్పించారు. వారికి రాష్ట్రప్రభుత్వం తరఫున రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆయన స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మురళీనాయక్ కుటుంబానికి ఐదెకరాలతో పాటు 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు నిర్ణయించారు. వీరజవాను కుటుంబానికి రూ.25 లక్షల వ్యక్తిగత సాయం చేస్తానని పవన్ హామీ ఇచ్చారు. ఇంకా ఎలాంటి సాయం కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మురళీనాయక్ కుటుంబానికి భగవంతుడు ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

### ముగిసిన వీర జవాను అంత్యక్రియలు

సత్యసాయి జిల్లా కల్లితండాలో వీరజవాను మురళీ నాయక్ అంత్యక్రియలు ముగిశాయి. అంత్యక్రియల్లో మంత్రులు నారా లోకేశ్ , అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, అనిత, సవిత, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొని నివాళి అర్పించారు.

## ప్రధాని మోదీ నివాసంలో మరోసారి హై లెవల్ మీటింగ్

కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించిన పాక్

సమీక్ష చేపట్టిన ప్రధాని మోదీ

మోదీ నివాసంలో సమావేశానికి రాజ్ నాథ్, జై శంకర్, దోవల్ హాజరు

హాజరైన సీడీఎస్, త్రివిధ దళాల అధిపతులు



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 11)

భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొద్ది గంటల్లోనే పాకిస్థాన్ దానిని ఉల్లంఘించిన నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు హై లెవల్ మీటింగ్ నిర్వహించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసం 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులు పాల్గొన్నారు. -మిగతా 2లో

## అమర జవాను మురళీ నాయక్ కుటుంబానికి బాలకృష్ణ అండ

అమర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి నెల వేతనాన్ని

సాయంగా ప్రకటించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

రేపు మురళీ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి

సాయాన్ని అందించనున్న బాలకృష్ణ పర్సనల్ సెక్రటరీలు

స్వగ్రామం గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకున్న

మురళీనాయక్ భౌతికకాయం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 11)

ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా జమ్మూకశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్‌కు సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అండగా నిలిచారు. జవాన్ కుటుంబానికి తనవంతు -మిగతా 2లో

## జగన్ పాలనలో మద్యపాన సంబంధ లివర్ జబ్బులు రెట్టింపయ్యాయి

ఆరోగ్యశ్రీ డేటాలో ఆందోళనకర వాస్తవాలు

పెరిగిన కాలేయ వ్యాధుల బాధితులు

2019-24 మధ్య కాలంలో 100 శాతం పెరిగిన లివర్ జబ్బులు

892 శాతం పెరిగిన నరాల వ్యాధులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 11)

ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో (2019-2024) మద్యపాన సంబంధిత కాలేయ వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య అంతకు ముందు ఐదేళ్లతో పోలిస్తే రెట్టింపు అయినట్లు రాష్ట్ర ప్రభుత్వం నియమి ంచిన నిపుణుల కమిటీ తేల్చింది. ఆరోగ్యశ్రీ పథకం కిం ద నమోదైన గణాంకాలను విశ్లేషించిన ఈ కమిటీ, కాలేయ వ్యాధులతో పాటు నరాల సంబంధిత సమస్యలు కూడా గణనీయంగా పెరిగాయని తన నివేదికలో పేర్కొంది. -మిగతా 2లో

## పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లోనూ 'భారత సేన గర్జించింది' - రాజ్‌నాథ్

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 11)



ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. భారత సైన్యం పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కేంద్రమున్న రావల్పిండిలోనూ గర్జించిందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బ్రహ్మోస్ ఉత్పత్తి కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన ఉగ్ర శక్తులకు భారత్ దీటుగా బదులిస్తుందన్నారు. ఈ ఆపరేషన్ ఉగ్రవాదంపై పోరులో దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తి సామర్థ్యాలను చాటిచెప్పిందన్నారు. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరిందన్నారు. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదని, కానీ, దాయాది మాత్రం పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసిందన్నారు.

మొదటిపేజీ తరువాయి

# పాక్ దాడిచేస్తే.. వినాశకరంగా ప్రతిస్పందిస్తాం

విరమణకు సిద్ధమంటూ పాక్ సైన్యం కోరడంతో తాత్కాలిక విరమణకు భారత్ అంగీకరించింది.తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించిన కొద్ది గంటల్లోనే పాక్ మళ్లీ దాడులకు తెగబడటం.. అనంతర పరిణామాలపై త్రివిధ దళాలతో ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ స్థాయిలో మే 12న చర్చలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి కీలక స్పందన వచ్చింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పంగించడం మినహా మరో విషయంపై మాట్లాడేది లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదుల అప్పగింతపై పాక్ మాట్లాడితే తాము మాట్లాడుతామని తెలిపాయి. అయితే, ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని, అటువంటి అవసరమూ లేదని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది.

# బ్రహ్మోస్ దెబ్బకు.. బెదిరిన పాక్ వాయుసేన స్థావరాలు

పంజాబ్ ప్రావిన్స్‌లోని రఫికీ వైమానిక స్థావరం షోర్కోట్‌లో ఉంది. అత్యాధునిక విమానాలకు ఇది కేంద్రం . ఇస్లామాబాద్‌కు 337 కిలోమీటర్ల దూరంలో ఉంది. 10,000 అడుగుల రన్‌వే ఇక్కడి ప్రత్యేకత. ఎమర్జెన్సీ ల్యాండింగ్ స్ట్రిప్‌లు ఉన్నాయి. పంజాబ్‌లోని చక్వాల్‌లో మురీద్ ఉంది. పాక్ ఆపరేషనల్ ఫ్లయింగ్ బేస్‌గా దీనికి పేరుంది. దీంతోపాటు మానవ రహిత సాయుధ డ్రోన్లు ఇక్కడ ఉన్నాయి. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌కు అత్యంత సమీపంలోని రావల్పిండిలో చక్లాలా వైమానిక స్థావరం ఉంది. పాక్ కీలక జనరల్స్ ఇక్కడే ఉంటారు. ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ కార్యాలయం కూడా చక్లాలాలోనే ఉంటుంది.

# ప్రధాని మోదీ నివాసంలో మరోసారి హై లెవల్ మీటింగ్

కాల్పుల విరమణ ఒప్పందం శనివారం ప్రకటించగా, అదే రోజు రాత్రి పాకిస్థాన్ ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిందని భారత్ ఆరోపించింది. ఈ ఉల్లంఘనలను పరిష్కరించడానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, పరిస్థితిని తీవ్రంగా, బాధ్యతాయుతంగా ఎదుర్కోవాలని పాకిస్థాన్‌ను భారత్ కోరినట్లు సమాచారం.ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్.. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలపై డ్రోన్ దాడులకు పాల్పడింది.

భారత రక్షణ వ్యవస్థలు ఈ డ్రోన్లను సమర్థవంతంగా అడ్డుకున్నప్పటికీ, అణ్వస్త్ర దేశాలైన ఇరు దేశాల మధ్య ఘర్షణలు మరింత తీవ్రమవుతాయేమోనన్న భయాలు వ్యక్తమయ్యాయి. అయితే, కొద్ది గంటల తర్వాత పరిస్థితి కొంత చల్లబడినప్పటికీ, సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు మాత్రం ఇంకా భయాందోళనలతోనే గడుపుతున్నారు. మోదీ నివాసంలో జరుగుతున్న తాజా సమావేశంలో సరిహద్దుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

# జగన్ పాలనలో మద్యపాన సంబంధ లివర్ జబ్బులు రెట్టింపయ్యాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన త్రిసభ్య నిపుణుల కమిటీ, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న అల్పదాయ వర్గాల ఆరోగ్య సమాచారాన్ని లోతుగా పరిశీలించింది. ఈ విశ్లేషణలో, 2014-19 మధ్య కాలంలో 14,026గా ఉన్న మద్యపాన సంబంధిత కాలేయ వ్యాధి కేసులు, 2019-24 నాటికి 29,369కి చేరాయని, అంటే ఏకంగా 100 శాతం పెరుగుదల నమోదైందని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది.ఇదే కాలంలో, మద్యపానం వల్ల తలెత్తే నరాల సంబంధిత రుగ్మతల కేసులు కూడా ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. 2014-19 మధ్య 1,276గా ఉన్న ఈ కేసులు, 2019-24 నాటికి 12,663కు చేరాయని, ఇది 892 శాతం పెరుగుదల అని నివేదిక పేర్కొంది. కాలేయం, కిడ్నీ, మానసిక ఆరోగ్యం, నరాల వ్యాధులు అనే నాలుగు విభాగాల్లో అసాధారణ పెరుగుదల ఉన్నట్లు కమిటీ గుర్తించింది.ఈ గణాంకాలపై రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పందిస్తూ, "2014-19తో పోలిస్తే 2019-24 మధ్య కాలంలో కాలేయ, నరాల సంబంధిత రోగుల సంఖ్యలో అనూహ్యమైన పెరుగుదలను మేము గుర్తించాం" అని తెలిపారు. ఈ నివేదికలోని అంశాలను మరింత లోతుగా అధ్యయనం చేసి, నివారణ చర్యలను సిఫార్సు చేసేందుకు జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ఒక సలహా మండలిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మద్యం వ్యాపారంలో అవకతవకలపై దర్యాప్తు

మద్యం వ్యాపారంలో జరిగిన అవకతవకలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్రంలో "చౌక రకం, నాణ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్న మద్యం" విక్రయం జరగడం వల్లే కాలేయ, కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ క్రమంలోనే, రాష్ట్ర ఆర్థిక నేరాల విభాగం (సీఐడీ) 2024లో నమోదు చేసిన ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది. కొనుగోలు ఉత్తర్వులను తారుమారు చేయడం, దేశవ్యాప్తంగా పేరున్న మద్యం బ్రాండ్లను తొలగించి, వైసీపీ అనుబంధ సంస్థలతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక బ్రాండ్లను ప్రవేశపెట్టడం వంటి అవకతవకలపై దర్యాప్తు అధికారులు విచారణ జరుపుతున్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలోని మద్యం దుకాణాల్లో నిల్వలు ఉన్నప్పటికీ, ప్రజాదరణ పొందిన బ్రాండ్లను ఉద్దేశపూర్వకంగా అందుబాటులో ఉంచలేదని, ఆంధ్ర గోల్డ్ విస్కీ, గుడ్ ఫ్రెండ్స్ విస్కీ, దేర్ హౌస్ బ్రాందీ, ఛాంపియన్ స్పెషల్ విస్కీ, హార్ట్స్ డిజైర్ విస్కీ వంటి కొత్త, స్థానికంగా ఉత్పత్తి అయిన బ్రాండ్లను నియంత్రణ పరిమితులకు మించి ప్రోత్సహించారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన మధ్యంతర నివేదికలో ఆరోపించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో మద్యపాన విధానాలు, వాటి పర్యవసానాలపై విస్తృత చర్చ జరుగుతోంది.

# అమర జవాను మురళీ నాయక్ కుటుంబానికి బాలకృష్ణ అండ

ఆర్థిక సహాయం ప్రకటించారు.ఒక నెల వేతనాన్ని మురళీనాయక్ కుటుంబానికి ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. సోమవారం మురళీనాయక్ స్వగ్రామానికి బాలకృష్ణ పర్సనల్ సెక్రటరీలు వెళ్లి జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. అనంతరం బాలకృష్ణ ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు.ఇదిలా ఉండగా, మురళీనాయక్ మృతదేహం నిన్న సాయంత్రం అతని స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకుంది. ముందుగా బెంగళూరు ఎయిర్ పోర్టులో మురళీనాయక్ భౌతికకాయానికి ఏపీ మంత్రి ఎస్. సవిత నివాళులర్పించారు.

# రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించిన పోలీసులు అనుమానితులు కనిపిస్తే వెంటనే మాకు తెలియజేయండి

ఎస్ఐ నరసింహారావు



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 11)

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కంభం ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో కలిసి కంభం రైల్వే స్టేషన్ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. అక్కడ ప్రయాణికుల వస్తువులు సోదాలు చేశారు. ప్రస్తుతం మన దేశంలో యుద్ధవాతావరణం నెలకొన్నందున కంభం మండలంలో అన్ని చోట్లా తనిఖీలు నిర్వహిస్తున్నామని రైల్వే స్టేషన్‌లు, బస్టాండులు, లాడ్జిలు, రెస్టారెంట్లు ఏవి వదలకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని ప్రతిఒక్కరు అనుమానితుల కదలికలపై ద్రుష్టి సారించాలని ఎవరైనా అనుమాతులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.








# అంగన్‌వాడీ సెంటర్లలో తల్లికి వందనం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 11)

ఉలవపాడు ప్రాజెక్టులోని గుడ్లూరు-2 తెట్టు సెక్టార్లలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఉలవపాడు ప్రాజెక్టు సిడిపిఓ తానికొండ శారద ఆదేశాల మేరకు గుడ్లూరు మండలంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లుల పట్ల బిడ్డలు ఎలా ప్రవర్తించాలి వారిని గౌరవించాలి ఎలా తల్లిదండ్రులను ఏ విధంగా సంరక్షించుకోవాలి అనేదాని గురించి వివరించారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపర్వైజర్ కామేశ్వరి మాట్లాడుతూ చిన్నప్పటి నుండి తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి అనేది తల్లిదండ్రులు నేర్పించాలని వారి పట్ల గౌరవ మర్యాదలతో ఇరుగు పొరుగు వారితో ఆడపిల్లలతో ఎలా ప్రవర్తించాలి సమాజంలో ఎలా ఉండాలి అనే వాటి గురించి వివరించడం జరిగింది. అలాగే అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో కూడా మదర్స్ డే సందర్భంగా (అడ్వాన్సుడ్ మదర్స్ డే)ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళల పట్ల జరుగుతున్న అత్యాచారాలను మహిళలపై జరుగుతున్న దాడుల గురించి వచ్చిన తల్లులకు పిల్లలకు వివరించారు. మహిళలు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి మగ పిల్లలతో ఎలా ప్రవర్తించాలి అనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కామేశ్వరి, 41 సెంటర్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.






# కవచ చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివి

(షణ్ముఖ వెలుగు, దక్కిలి, మే 11)

తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం 25 వ వార్డు లోని కంపాలెం అంబేద్కర్ విగ్రహం దగ్గర కవచ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ (తిరుపతి ) ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ (తిరుపతి) వారు సంయుక్తంగా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కవచ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ న్యాయవాది గుండు మనోజ్ కుమార్ మాట్లాడుతూ మా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈరోజు ఈ మెగా వైద్య నిర్వహించడంలో భాగమైన వాసన్ ఐ కేర్ (తిరుపతి ), ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ (తిరుపతి) వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు, బి పి, షుగర్, థైరాయడ్ మొదలగు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కవచ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గతంలో అనేక ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించమని భవిష్యత్ లోకూడా ఈ లాంటి సేవా కార్యక్రమాలు చేయడంలో ముందు ఉంటామని అయన తెలిపారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## కాబోయే వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి బాలినేని దంపతులు

(షణ్ముఖ వెలుగు, విజయవాడ, మే 11)

విజయవాడ నోవాటల్ హోటల్ నందు ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త తులసి కుమార్తె నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి సచిదేవిలు కాబోయే వధూవరులను నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.

### చలివేంద్రాలు ప్రారంభించిన

## వాసవి జాగృతి మిత్రమండలి క్లబ్



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మే 11)

వాసవి జాగృతి ప్రకాశం జిల్లాలో వాసవి జాగృతి మిత్రమండలి క్లబ్ గిద్దలూరు క్లబ్‌లో భాగంగా ఇప్పటికే 2 చలివేంద్రంలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం వాసవి జాగృతి ప్రకాశం జిల్లా గవర్నర్ ఆర్యన్ ప్రవీణ్ చేతుల మీదుగా ఉగిద్దలూరు గణేష్ నగర్ నందు గల వెంకటేశ్వర ఎలక్ట్రానిక్స్,



## వైసీపీ నాయకుల మాట-మంతీ

### ఇద్దరి నాయకుల మధ్య ఆసక్తికర రాజకీయ చర్చ
### నిజమేనన్న మరో మాజీ ఎమ్మెల్యే ముఖ్యుడు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 11)

ఆదివారం ఉదయం పూట వాకింగ్ చేస్తున్నారు ఇద్దరు వైసీపీ నాయకులు...వారిలో ఒకరు కనిగిరి పట్టణంలోని ఓ కౌన్సిలర్ కుమారుడు కాగా...మరొకరు ఓ ఎంపిటిసి సభ్యుడు... కనిగిరి ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఆ ఇద్దరు వైసీపీ నాయకులు వాకింగ్ చేస్తున్నారు.. ఆ వాకింగ్‌లో వారిద్దరి మధ్య రాజకీయ చర్చ ఆసక్తికరంగా సాగింది. ఆ కౌన్సిలర్ కుమారుడు కందుకూరులో మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ గెలిచేవారని, ఆఖరి సమయంలో అక్కడ మాజీ మంత్రి చేయకపోవడంతో ఓడిపోయారని కౌన్సిలర్ కుమారుడు అనడంతో ఆ ఎంపిటిసి సభ్యుడికి తీవ్ర ఆగ్రహం కల్గించింది... వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధిపొందిన మీరు కనిగిరి వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు మద్ధతుగా పని చేయకుండా కందుకూరులో ఎలా తిరిగారని ఆ ఎంపిటిసి కౌన్సిలర్ కుమారుడిని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో వైసీపీ కంచుకోట నియోజకవర్గాల్లో కూడా కూటమి అభ్యర్థులు గెలిచారని, కందుకూరులో బుర్రా ఎలా గెలుస్తాడని ఆవేశంగా మాట్లాడారు...కనిగిరిలో బుర్రా ఐదేళ్ళ పాలనలో చెప్పుకునే ఒక్క పనైనా చూపుతావా అని కౌన్సిలర్ కుమారుడిని ఆ ఎంపిటిసి నిలదీశాడు..అయితే బుర్రా చేసిన పనులేమి లేకపోవడంతో అతను వితండవాదనకు దిగాడు...2009లో ఉగ్ర ఎమ్మెల్యేగా గెలిచినపుడు పాలేటిపల్లి రిజర్వాయర్, అలవలపాడు బ్రిడ్జి, టుబాకో బోర్డు, గొర్రెల మండి ఏర్పాటు చేశారని, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కనిగిరి హైవే రోడ్డు, బయోగ్యాస్ ప్లాంట్, గొర్రెల మండిని ప్రారంభించడం అత్యధికంగా సిసి రోడ్లు తెచ్చారని, పార్టీ ఏదైనా కనిగిరిలో అభివృద్ధి చేసింది ఆయనేనంటూ ఆ ఎంపిటిసి అభివృద్ధి పనుల పట్టిక చదివాడు...బుర్రా కనిగిరికి ఏం చేశాడో చెప్పాలంటూ పదేపదే ప్రశ్నించడంతో కౌన్సిలర్ కుమారుడు మౌనం దాల్చాడు. ఆ సమయంలో వారి వద్దకు ఓ మాజీ ఎమ్మెల్యే ముఖ్య శిష్యుడు వచ్చాడు. అన్నా అంటూ ఎంపిటిసితో మాట కలిపాడు. టిడిపి పాలనలో బాబురావు సిఎస్‌పురం నుండి కనిగిరి, పామూరులకు డబుల్ రోడ్లు వేశారని, వ్యవసాయ కళాశాలను మంజూరు చేయించారని, సిమెంటు రోడ్లకు అధిక నిధులు తెచ్చాడని ఆ ఎంపిటిసి అన్నారు. ఐదేళ్ళ పాలనలో బుర్రా ఏం చేశాడో చెప్పాలని బాబురావు ముఖ్య శిష్యుడి ఎదుట ఆ ఎంపిటిసి కౌన్సిలర్ కుమారుడిని మళ్ళీ నిలదీశాడు. 2029లో బుర్రాకు కందుకూరు టిక్కెట్ ఇస్తే వైసీపీ ఒక సీటు కోల్పోయినట్లేనని అక్కడ సరైన అభ్యర్థి మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డినే నని ఎంపిటిసి వారితో చర్చించడం గమనార్హం. ఈ క్రమంలో బాబురావు ప్రియ శిష్యుడు కూడా బుర్రా ఏం చేశాడో చెప్పాలని ఆ కౌన్సిలర్ కుమారుడిని నిలదీయడంతో ఆ యువకుడు అక్కడ నుంచి జారుకున్నాడు....!



## పాక్ టెర్రరిస్టులే దొరికిపోతున్నారు...

### కాకాణి మాత్రం చిక్కడం లేదు
### గోవర్ధన్‌రెడ్డి మోస్ట్ టాలెంటెడ్ అని
### పొగడ్తల వర్షం కురిపించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)

పాకిస్థాన్ టెర్రరిస్టులు చిక్కుతున్నారు కానీ.... కాకాణి మాత్రం దొరకడం లేదు. కరోనా హౌస్ బహుమతిగా ఇస్తామని ప్రకటించినా ఆయన ఆచూకీ ఎవరూ కనిపెట్టలేకపోతున్నారని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. (తరువాయి 4లో...)



## జిల్లాకు మూడు నామినేటెడ్ పదవులు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 11)

ఆదివారం కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల్లో ప్రకాశం జిల్లాకు మూడు పోస్టులు అందజేశారు. కూటమి పార్టీలను నమ్ముకుని పని చేస్తున్న వారికి ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కలిసి నియమించారు. వారిలో ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్, కనిగిరికి చెందిన శ్యామల కాశిరెడ్డిని డిసిఎంఎస్ ఛైర్మన్‌గా, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌కు ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్ గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావును జిల్లా డిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా ఎంపికైన కామేపల్లి సీతారామయ్య, ప్రముఖ పంటి వైద్యులు డాక్టర్ నామినేని కిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.





# చలివేంద్రాలు ప్రారంభించిన వాసవి జాగృతి మిత్రమండలి క్లబ్

ఫర్నిచర్ షాప్ నందు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని హర్ష పెయింట్ షాప్ నందు రెండుచోట్ల చలివేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవి ఎండల తీవ్రత చల్లని కూల్ డ్రింక్స్ మిరిండా 150 మందికి గవర్నర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీసీ ఆఫీసర్ ఆర్యన్ సూర్య చెంచయ్య, బాదం వెంకటేశ్వర్లు, దాతగా ఆర్యన్ గర్రె నారాయణ సహకరించారు. వాసవి జాగృతి మిత్రమండలి సభ్యులు జి వెంకట సుబ్బారావు, సూరే శ్రీనివాసులు, బచ్చు వెంకట వరప్రసాద్, బచ్చు సుబ్బారావు, గర్రె శ్రీధర్, గర్రె వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10 తరగతిలో 578 అత్యధిక మార్కులు సాధించిన గంగిశెట్టి ప్రణీత హాసినికి మెమొంటో గవర్నర్ చేతుల మీదుగా అందించారు. ఆర్యన్, శివపురం హరికృష్ణ, వాసవి జాగృతి మిత్రమండలి క్లబ్ గిద్దలూరు అధ్యక్షుడు పాల్గొన్నారు.

# పరకొండపాడులో శ్రీ అభయ లక్ష్మీనరసింహస్వామి జయంతి

## వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 11)**

గుడ్లూరు మండలం పరకొండపాడు గ్రామ పరిధిలోని వడ్లమూడివారిపాలెంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ అభయ లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి వార్షికోత్సవ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనాల నడుమ ఆలయ ప్రాంగణంలోనికి ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకి వేద పండితులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ అభయ లక్ష్మీ నరసింహస్వామి వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.













# మే 15 నుంచి వాట్సాప్‌లో రేషన్ కార్డు దరఖాస్తు

**మంత్రి నాదెండ్ల**

**రైస్ కార్డ్: సులభతర సేవలు ప్రారంభం**

**72,519 మంది రైస్ కార్డ్ సేవలు వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల వెల్లడి**

**జూన్‌లో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 11)**



రాష్ట్రంలో పౌర సరఫరాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. నూతన రైస్ కార్డుల జారీతో పాటు ఇతర ఆరు రకాల అనుబంధ సేవలను అందు బాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ సేవలను ఇప్పటికే 72,519 మంది వినియోగించుకున్నారని, మే 15వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ విధానం ద్వారా కూడా ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.గుంటూరు జిల్లా తెనాలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ నుంచి నూతన రైస్ కార్డుల జారీ, కార్డుల విభజన, చిరునామా మార్పు, కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, కార్డుల సరెండర్ వంటి ఆరు రకాల సేవలు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు. త్వరలో, అంటే మే 15 నుంచి, 95523 00009 నంబర్‌కు వాట్సాప్ లో అని సందేశం పంపడం ద్వారా కూడా ఈ సేవలను పొందవచ్చని మంత్రి తెలిపారు. అంతేకాకుండా, జూన్ మాసంలో అర్హులైన వారందరికీ ఉచితంగా స్మార్ట్ కార్డుల రూపంలో నూతన రైస్ కార్డులను అందజేయనున్నట్లు ప్రకటించారు.నూతన రైస్ కార్డుల జారీ ప్రక్రియలో జాప్యం గురించి వివరిస్తూ, “2024 ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది మార్చిలో భారత ఎన్నికల సంఘం నూతన కార్డుల జారీని నిలిపివేయాలని ఆదేశించింది. ఆ తర్వాత, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు %జూదిగిబీ% నమోదు తప్పనిసరి చేయడంతో నూతన కార్డుల జారీకి కొంత ఆటంకం ఏర్పడింది. అయితే, ఇప్పటివరకు 95 శాతం %జూదిగిబీ% ప్రక్రియ పూర్తయినందున, ఇప్పుడు నూతన రైస్ కార్డుల జారీకి మార్గం సుగమమైంది” అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,46,21,223 రైస్ కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 4,24,59,028 మంది లబ్ధి పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 80 ఏళ్ళు పైబడిన వృద్ధులకు నుంచి మినహాయింపు ఇవ్వడంతో దాదాపు 6,45,765 మందికి ఈ ప్రక్రియ అవసరం లేకపోయిందని అన్నారు.సంస్కరణల్లో భాగంగా, %జూదిగిబీ% పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తామని, ఈ కార్డులో కుటుంబ సభ్యులందరి వివరాలు పొందుపరచబడతాయని మంత్రి వివరించారు. ఒంటరిగా నివసిస్తున్న వారు, 50 ఏళ్లు పైబడి వివాహం కానివారు, భార్యాభర్తల నుంచి విడిపోయినవారు, అనాథాశ్రమాల్లో నివసించే వృద్ధులు కూడా నూతన రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.

# పాక్ టెర్రరిస్టులే దొరికి పోతున్నారు...

ఆదివారం ఆయన మనుబోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకాణి మోస్ట్ టాలెంటె దోపిడీలు, అక్రమాలు చేసి తప్పించుకోవడంలో నెంబర్ 1 అని వ్యాఖ్యానించారు. 2016లో నా కుటుంబానికి విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులున్నాయని నకిలీపత్రాలు తయారుచేశాడు. అప్పట్లో ఆ కేసులోనూ రెండు నెలలు కనిపించకుండా పోయి సుప్రీంకోర్టుకు వెళ్లి కండీషన్ బెయిల్ తెచ్చుకున్నాడు. ఇప్పుడు కూడా 45 రోజులుగా పరారీలో ఉన్నాడు.ఎక్కడ ఏ కలుగులో నక్కాడో ఎవరూ కనిపెట్టలేకపోతున్నారు . నేరాలు ఘోరాలు చేయడమే కాదుతప్పించుకుని పారిపోవడం కూడా తెలిసిన నేర్పరి అన్నారు. కాకాణి గోవర్ధన్ చేసిన పాపాలపై ఒక పుస్తకం రాసినా సరిపోదన్నారు. ల్యాండ్, మైన్, వైన్, శాండ్ తో పాటు టోల్ గేట్లనూ సైతం వదిలిపెట్టలేదు. ఎస్సీ, ఎస్టీల భూములను సైతం కాజేసిన మహానుభావుడాయన ఆయన ఎద్దేవా చేశారు. వావిలేటిపాడులో దళితులు, సర్వేపల్లిలో గిరిజనుల భూములను చెరపట్టాడు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి పుణ్యాన వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని శాఖల్లో కలిపి సుమారు 25 మంది అధికారులు, ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. టీడీపీ నాయకులపై దాడి చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడమే గాక తిరిగి వారిపైనే అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపించిన నియంత కాకాణి అన్నారు. ఆనాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన పాపాలకు ఈ రోజు ఫలితం అనుభవిస్తున్నాడు అని అన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న దామచర్ల సత్య



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 11)**

మండల కేంద్రమైన పొన్నలూరులో ఆదివారం గడ్డం మాలకొండయ్య కోటేశ్వరమ్మ కుమారుడు బలరాం, చప్పిడి లక్ష్మీనరసింహం, సత్యవతి కుమార్తె హరిత వివాహ కార్యక్రమానికి ఆంధ్ర మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, అనుమోలు సుధాకర్, పల్లపోతు వెంకట్రావు, ఉన్నం శ్రీనయ్య, పల్లపోతు వెంకట్రావు, మండవ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# రెండో పంటకు నీరు అందించడం ఒక చరిత్ర

## రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)

ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సంబంధించి 5.24 లక్షల ఎకరాల (రబీ) రెండో పంటకు నీరు అందించడం ఒక చరిత్ర అని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు సంతపేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆనం ఆత్మకూరు నియోజకవర్గంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా రైతాంగానికి గతంలో ఎన్నడూ లేని విధంగా సోమశిల ద్వారా రెండో పంటకు సాగునీరు విడుదల చేయడం చరిత్రలో మొదటిసారని అన్నారు. గతంలో ఏనాడు నాన్ డెల్టా కు నీళ్లు విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన సహకారం, కృష్ణా జలాలు, పెన్నా పరీవాహక ప్రాంతంలో సమృద్ధి నీరు, సోమశిల, కండలేరు లలో మిగులు జలాలు, సక్రమ నీటి నిర్వహణ సామర్థ్యంతో డెల్టాతో పాటు నాన్ డెల్టాకు నీటి విడుదల సాధ్యమైందన్నారుతన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో అత్యధికంగా 1 లక్షా 80 వేల ఎకరాలకు ఇవ్వడమే జరిగిందని, రెండో పంటకు ఐదు లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడం ఇదే తొలిసారన్నారు. ఇంత పెద్ద ఎత్తున నీరందించడం పేద మధ్య తరగతి రైతాంగం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పెరిగిన పెన్నా ఆయకట్టు ననుసరించి పెన్నా డెల్టా లోని 2 లక్షల ఎకరాలకు 22 టీఎంసీల నీరు, అలాగే నాన్ డెల్టా లోని 4 కాలువలు ద్వారా లక్షా 64 వేల ఎకరాలకు 16 టి యం సి ల నీటిని అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా 16 టీఎంసీలు నీటిని నెల్లూరు ఉమ్మడి జిల్లాలోని వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలలోని 36 వేల ఎకరాలకు, అలాగే తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు తదితర నియోజకవర్గాలలోని 1లక్షా 24 వేల ఎకరాలు మొత్తం కలిపి ఐదు లక్షల ఇరవై నాలుగు వేల ఎకరాలకు రెండో పంటకు సాగునీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా తిరుపతి, శ్రీకాళహస్తి వంటి పుణ్యక్షేత్రాల్లో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా కండలేరు జలాశయంలో పది టీఎంసీల నీటిని ఎక్కువ పరిమాణంలో నిల్వ చేశామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేసిన దశ నుంచి ఇరిగేషన్ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఇరిగేషన్ కాలువలపై స్వయంగా పర్యటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని అన్నారు. ముఖ్యమంత్రి నెల్లూరు జిల్లా మొదటి పర్యటనలోనే సోమశిల ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు రిపేర్లను వెంటనే పూర్తి చేయమని ఆదేశించటమే కాకుండా సోమశిల హైలెవెల్ కెనాల్ కు నిధులు మంజూరు చేశారన్నారు. మెట్ట ప్రాంత రైతాంగానికి ప్రాధాన్యతనిస్తూ సాగునీరు అందించే కార్యక్రమంతో పాటు పరిశ్రమల స్థాపనకు సైతం బాధ్యత తీసుకుంటామని ఇటీవలి జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి తెలిపారన్నారు. సామాన్య మధ్యతరగతి రైతాంగం పట్ల నిబద్ధత గల ప్రభుత్వం తమదన్నారు. అదేవిధంగా మంగళగిరి, నెల్లూరు నగర పరిధిలోని భగత్ సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో వాగు పోరంబోకు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఇబ్బంది లేని ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ఇటీవలి మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఆమోదించారన్నారు. సోమశిల గేట్లు మార్పిడి, రోప్, గ్రీసింగ్ పనుల టెండర్లు పూర్తి అయ్యాయని త్వరలో చేపడతామన్నారు.

### 22 మందికి 37.25 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో అవకాశం లేని పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన 22 మందికి రు. 37,25,213 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఇందులో ఆత్మకూరు మండలంనుండి 6 మంది, మర్రిపాడు 4, ఏఎస్ పేట 1, చేజర్ల 5, ఇతరులు ఇద్దరు ఉన్నారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 205 పేద కుటుంబాలకు రు.2,59,28,251 రూపాయల ఆర్థికలబ్ది ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందజేయడం పేద మధ్య తరగతి వర్గాల ప్రజలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న ఆపేక్షను తెలియజేస్తుందన్నారు.

### భరతమాత ముద్దుబిడ్డ మురళీ నాయక్‌కు ఘన నివాళి

పాకిస్తాన్ తో జరుగుతున్న విరోచిత పోరాటంలో అమరుడైన మన రాష్ట్రంలోని శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబానికి తామందరూ రుణపడి ఉంటామన్నారు. ఘనమైన ప్రజాస్వామ్యంతో పరిఢవిల్లుతున్న మన భారతదేశాన్ని ఎదుర్కొనే శక్తి ఉగ్రవాదమే విధానంగా మనుగడ సాగిస్తున్న పాకిస్థాన్ కు లేదన్నారు. అమాయక భారతీయ మహిళల సింధూరాన్ని తుడిచేసిన ముష్కర పాకిస్తాన్ కు ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ కు చెందిన మహిళా అధికారుల ఆధ్వర్యంలో మహిళా శక్తిని ఘనంగా చాటుతూ ఆపరేషన్ సింధూర్ ను నిర్వహిస్తు న్నారన్నారు.

ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో మహానాడు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్, టిడిపి పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు మూడురోజులపాటు కడప శివార్లలో మహానాడు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో ఆత్మకూరు నియోజవర్గం రాష్ట్రంలో మూడవ స్థానంలో అలాగే శాశ్వత సభ్యత నమోదులో రెండవ స్థానంలో కొనసాగుతున్నట్లుగా తెలిపారు. ఇదే విధమైన స్ఫూర్తితో మహానాడు కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి అన్ని స్థాయిల కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# కళ్లకు బ్లాక్ రిబ్బన్‌లతో వైసీపీ నిరసన







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)

కూటమి ప్రభుత్వం మహిళల మీద అర్ధరాత్రుల సమయాలలో జరుపుతున్న పోలీసుల దాడులకు నిరసనగా కళ్ళకు బ్లాక్ రిబ్బన్లు కట్టుకొని.. ప్రస్తుత పాలనను ప్రజాస్వామ్యంలో కీచక పర్వంగా.. అభివర్ణిస్తూ నిరసన తెలిపారు వైసీపీ నేతలు. నెల్లూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ సునందా ,కార్పొరేటర్ కామాక్షి దేవి, మాజీ మంత్రి విడుదల రజిని, దళిత మహిళ ఎంపీటీసీ కల్పన పట్ల పోలీసులు వ్యవహరించిన అత్యంత అమానుషమైన తీరుకు నిరసనగా.. వైసీపీ నేతలు కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకొని.. మహిళల పట్ల పోలీసుల వ్యవహరిస్తున్న తీరు.. ప్రజాస్వామ్యంలో కీచక పర్వం గా అభివర్ణిస్తూ.. నిరసన తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ సునంద మాట్లాడుతూ..చంద్రబాబు పాలన లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మాజీ మంత్రి విడుదల రజిని పై పోలీసుల.. దౌర్జన్యం దాడి, అలాగే కంతేరు ఎంపీటీసీ కల్పనని పోలీసులు అరెస్టు చేసిన విధానాన్ని మహిళలంతా తీవ్రంగా ఖండిస్తున్నారని అన్నారు. ఈ రెండు ఘటనల్లో పోలీసులు వ్యవహరించిన తీరు.. ప్రజాస్వామ్యంలో కీచక పర్వంగా ఆమె అభివర్ణించారు. అందుకు నిరసనగా ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో.. కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకొని.. మహిళలందరూ నిరసన తెలియజేస్తున్నామన్నారు.చంద్రబాబు నాయుడుకి ప్రజలు అధికారం ఇచ్చింది.. ఇందుకేనా అని ప్రశ్నించారు. మహిళ అర్ధరాత్రి నిర్భయంగా తిరగ గలిగిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్రం అని మహాత్మా గాంధీ అన్నారని.. కానీ ఈ రోజు కూటమి ప్రభుత్వ పాలనలో.. పట్టపగలే మహిళలు రోడ్లపై తిరిగేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు పార్టీలకు అతీతంగా మహిళలందరూ ముందుకు వచ్చి ఖండించాలన్నారు. కార్పొరేటర్ కామాక్షి దేవి మాట్లాడుతూ ఈ రోజు తెలుగుదేశం పార్టీ నీచ రాజకీయాలకు పాల్పడుతుందని అన్నారు. మంత్రి విడుదల రజిని, కంతేరు ఎంపీటీసీ కల్పన పట్ల.. పోలీసులు వివరించిన తీరును.. మహిళలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారని అన్నారు. మహిళా నేతల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు.. బాధాకరమని.. ఇలా వారి ఇళ్లల్లో మహిళలకు జరిగితే వారు ఊరుకుంటారా సమాధానం చెప్పాలన్నారు. రాత్రి 3.30 గంటలకు దళిత మహిళా ఎంపీటీసీ కల్పనను అరెస్టు చేసిన విధానాన్ని యావత్ మహిళాలోకం ఖండిస్తుందన్నారు.

# ప్రజల అభివృద్ధి...సంక్షేమమే పరమావధిగా పాలన

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 11)



నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పయనింపచేయాలని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి-పరమావధిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పయనం కొనసాగుతున్నది. దీనిలో భాగంగా కందుకూరు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ఆయన నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. దానికోసం కావలసిన నిధులను సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో విడుదల చేయించుకోవడంలో సఫలీకృతమయ్యారు. సీఎం కందుకూరు పర్యటన సందర్భంగా పట్టణానికి కేటాయించిన 56 కోట్లలో 26 కోట్ల రూపాయలను ఎమ్మెల్యే వెనువెంటనే రాబట్టుకోగలిగారు. గత పాలకులు చేయాల్సిన పని., చేయకపోవడంతో నేడు పట్నంలో ట్రాఫిక్ భూతం జడలు విప్పి కరాల నృత్యం చేస్తున్నది. పామూరురోడ్, అంకమ్మ తల్లి దేవాలయం, కోటారెడ్డి హాస్పిటల్ కూడలి, ఆర్టీసీ డిపో కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య నానాటికి తీవ్రతరంగా పరిణమిస్తూ, ప్రజలను ఇబ్బంది పెడుతుంది. ట్రాఫిక్ సమస్యను నివారించడానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు ప్రయోగాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. పామూరు రోడ్లో ఆక్రమణలు తొలగించి, అక్కడ జంక్షన్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను నివారించాలనే సత్సంకల్పంతో ఉన్నారు .దానికి సంబంధించి కార్యాచరణ జరుగుతూ ఉంది. అదేవిధంగా ఎర్రవాగు వరకు అతిపెద్ద డ్రైన్ ను నిర్మించి సక్రమ మురుగునీటిపారుదలకు కృషి చేస్తున్నారు. పట్టణంలో లింగయ్య నాయుడు పార్కు గత ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన విషయాన్ని గమనించి ,ఆయన యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి, లింగయ్య నాయుడు పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చిన్నారులు ఆడుకోవడానికి కావలసిన ఆట సామాగ్రిని సైతం అక్కడ ఏర్పాటు చేశారు. వివిధ మండలాల్లో 127 కోట్లకు పైచిలుకు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని సాగునీటి చెరువుల మరమ్మత్తు పనులు త్వరలో ఊపు అందుకోనున్నాయి. రాళ్లపాడు నుండి ప్రత్తి రైతుల కోరిక మేరకు నీరును సజావుగా అందిస్తున్నారు. కొంతమంది కుహనా రాజకీయ నాయకులు కందుకూరు రెవెన్యూ రికార్డులను దగ్గర ఉంచుకొని ఆక్రమణదారులకు తప్పుడు సలహాలిస్తూ, కోర్టులను ఆశ్రయించి ఎమ్మెల్యే ఎన్ఆర్ తలపెట్టిన అభివృద్ధి పనులను అడ్డుకోవాలనే దుర్బుద్ధితో ఉండడాన్ని పట్టణ ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఏది ఏమైనా ఎమ్మెల్యే ఐ ఎన్ ఆర్ తన పదినెలల పాలనా కాలంలో కందుకూరు పట్టణ రూపురేఖలను మార్చి మౌలిక సదుపాయాల కల్పనలో జిల్లాలోనే ముకుటాయమానంగా తీర్చిదిద్దాలనే యోచనలో ఉండడం పట్ల పలువురు రాజకీయ విశ్లేషకులు, ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు...అయ్యన్నార్ ను అభినందిస్తున్నారు.

# చెన్నుపాడు అడ్డరోడ్డు దగ్గర బైక్ ప్రమాదం





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 11)

మండలంలోని చెన్నుపాడు అడ్డరోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పొలంలోకి దూసుకొని వెళ్ళింది. ఈ ప్రమాదంలో రజనీకాంత్‌కు చెయ్యి ఫ్రాక్చర్ అవ్వగా, రంగస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కందుకూరు నుండి గిద్దలూరు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకి తరలించారు.

# వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ నరసింహారావు

(షణ్ముఖ వెలుగు, కంభం, మే 11)

కంభం వై జంక్షన్‌లో ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు అనుమానితుల కదిలకల కోసం వాహన తనిఖీలు చేస్తున్నట్టు ఎస్ఐ నరసింహారావు తెలిపారు. ఏ వాహనాన్ని వదిలిపెట్టకుండా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కంభం పట్టణంలో ఎవరి మీద అనుమానం అనిపిస్తే మాకు సమాచారం అందజేలని పట్టణ ప్రజలను కోరుతున్నామని ఎస్ఐ తెలిపారు. వివరాలు అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







# కూటమి ప్రభుత్వ పాలన కీచక పర్వాన్ని తలపిస్తున్నది



## ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి




**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)**

ఆదివారం నాడు నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ మహిళా నేతలతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పత్రిక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ మంత్రి విడదల రజిని, దళిత మహిళ ఎంపీటీసీ కల్పన పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. భారత దేశంలో మహిళలకు ఎంతో గౌరవం ఇచ్చి వారిని అన్ని రంగాలలో ప్రోత్సహిస్తుంటే కూటమి ప్రభుత్వం మాత్రం మహిళల పట్ల కర్కశంగా, అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలలో వారి ఆనందం కోసం పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని పోలీస్‌లు ఇప్పటికైనా పోలీసులు తమ తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 11 నెలలుగా కూటమి ప్రభుత్వం ఈ రాష్ట్రంలో అరాచక పాలనను కొనసాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలు గాలికొదిలేసి అవినీతి అక్రమాలే, ధ్యేయంగా తెలుగు తమ్ముళ్లు వ్యవహరిస్తున్న తీరు సరికాదు అని అన్నారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతునొక్కేలా వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనయిస్తుందన్నారు. రాష్ట్రంలో ఈనెల 9, 10 వ తేదీల్లో జరిగిన వరుస ఘటనలు చూస్తే ఈ ప్రభుత్వం మహిళలపై చేస్తున్న దుర్మార్గాలు ప్రతి ఒక్కరికి అర్థమవుతుందన్నారు. మాజీ మంత్రి విడదల రజిని పిఏ అరెస్టులో భాగంగా రజిని పై పోలీసులు ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఒక మాజీ మంత్రిగా బిసి మహిళ అయిన విడుదల రజినికి తన పిఏ ను ఎందుకు అరెస్టు చేస్తున్నారని, పోలీసులను అడిగే హక్కు లేదా అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు పోలీసులు సమాధానం చెప్పాల్సింది పోయి మాజీ మంత్రి విడుదల రజినిని అవసరం అయితే నిన్ను కూడా అరెస్టు చేస్తాం అంటూ ఏకవచనంతో మాట్లాడుతూ ఆమె పట్ల అత్యంత అగౌరవంగా ప్రవర్తిస్తూ ఆమె పై దాడికి దిగిన విధానం చూస్తుంటే ఈ రాష్ట్రం లో ప్రజలకు ప్రధానంగా మహిళకులకు రక్షణ ఉందా అన్న ప్రశ్న ప్రతి ఒక్క మహిళలో కలుగుతుందన్నారు. ఈ నెల 9వ తేదీ జరిగిన ఘటన గుంటూరు జిల్లా కంతేరు ఎంపీటీసీ దళిత మహిళ అయినటువంటి కల్పనపై స్థానిక సీఐ ప్రవర్తించిన తీరు యావత్ మహిళ లోకాన్నే కించపరిచే విధంగా ఉందన్నారు. ఎంపీటీసీ కల్పన కుమారుడి పై కొంతమంది కూటమి నేతలు దాడి చేస్తే దీని పై కల్పన, వారి వద్దకు వెళ్ళి ఇదేంటని ప్రశ్నించినందుకు ఆమె పై కూడా దాడి చేసి గాయపరిచారు. తమ కుమారుడు పై దాడిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా .. కల్పన ఇచ్చిన ఫిర్యాదును పక్కనపెట్టి.. దాడి చేసిన కూటమి నేతలు ఇచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకొని.. కల్పనని అర్ధరాత్రి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. రాత్రిళ్లు 3:30 నిమిషాలకు.. పోలీసులు కల్పన ఇంటికి వెళ్లి.. కల్పనని అరెస్టు చేస్తున్నామని చెప్పగా.. రాత్రి సమయంలో కల్పన గారు నైటీలో ఉండగా.. చీర మార్చుకుంటాను అని చెప్పిన వినకుండా.. పోలీసులు జీపులో ఒక జంతువుని లాక్కొచ్చినట్లు తీసుకువచ్చి ఎక్కించారని.. ఇంత దుర్మార్గం ఎక్కడైనా ఉంటుందా అని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి.. కల్పన తల్లి.. మా బిడ్డకు కనీసం చీర కట్టుకునే అవకాశం అయినా ఇవ్వండి అని చెప్పినా వినలేదు. ఇక ఆమె చేసేది లేక ఇంట్లోనుంచి చీర తీసుకొని బయటకు వస్తే.. పోలీసులు ఆ చీర ఇలా ఇవ్వు మేము.. జీపులో కడతాము.. అని మగ పోలీసులు మాట్లాడటం.. మహిళ లోకాన్నె.. అవమానించే విధంగా వారి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇలా తెలుగుదేశం పార్టీ పాలనలో.. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు.. అత్యంత జుపుక్సాకరమన్నారు. ఒక బీసీ మహిళ, దళిత మహిళల పట్ల.. కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరును.. ఈ రోజు మహిళ లోకం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మాజీ మంత్రి విడుదల రజిని పట్ల, అలాగే కంతేరు ఎంపీటీసీ దళిత మహిళ కల్పన పట్ల.. పోలీసులు వ్యవహరించిన తీరును.. వీడియో ప్రింటేషన్ ద్వారా పాత్రికేయలకు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. మహిళలను అవమానించిన.. ఏ ప్రభుత్వం ఎక్కువకాలం అధికారంలో లేదని.. ఎన్నికల్లో ఆ పార్టీ కి తీవ్ర పరాభవాన్ని..ప్రజలు రుచి చూపించిన.. విషయం మనమంతా చూసామని.. తెలుగుదేశం పార్టీకి కూడా రాబోయే రోజుల్లో అదే గతి పడుతుందని హెచ్చరించారు. ఒకపక్క భారతదేశంలో.. ఆపరేషన్ సింధూర్.. పేరుతో కేంద్ర ప్రభుత్వం ముష్కరులను మట్టు పెడుతుంటే.. భారత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే.. మరోపక్క ఆంధ్రప్రదేశ్‌లో.. మహిళలను అగౌరవపరుస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం వారి పట్ల వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారని అన్నారు. ఈ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్..పూర్తిగా అదుపు తప్పిందని.. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తల విషయంలో పోలీసులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ..వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ..కక్ష్య సాధింపు చర్యలకు దిగతూ.. అధికారి పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏపీ లో లిక్కర్, గంజాయి, డ్రగ్స్.. విపరీతంగా దొరుకుతుండడంతో రాష్ట్రంలో నిమిషానికొ హత్య.. చోటు చేసుకుంటూ.. సగటు మనిషికి భద్రత కరువైందని అన్నారు. ఈరోజు తెలుగుదేశం పార్టీ మహిళల పట్ల వ్యవహరించిన తీరుకు నిరసనగా మహిళలందరూ.. తీవ్ర నిరసన తెలియజేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ మహిళల పట్ల ఇలాగే వ్యవహరిస్తే మహిళలే రోడ్డు మీదకు వచ్చి తిరుగుబాటు చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ సమావేశంలో వైఎస్ఆర్సిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ సునంద, కార్పొరేటర్ కామాక్షి దేవి, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్‌రెడ్డి, 11వ డివిజన్ ఇంచార్జ్ మహేష్ యాదవ్, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు కూలీల ఆటో బోల్తా తృటిలో తప్పిన ప్రమాదం







**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 11)**

స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఆదివారం రైతు కూలీల ఆటో బోల్తా పడి ఎవ్వరికి ఎటువంటి గాయాలు గాని ప్రాణ నష్టం కానీ జరగలేదు. రైతు కూలీలు పొగాకు గ్రేడింగ్ కోసం కందుకూరు నుంచి రెడ్డిపాలెం వెళ్లే క్రమంలో ఆటో చెకప్స్ కట్స్ దగ్గర బోల్టు ఊడి అనుకోకుండా ఆటో తిరగబడింది, ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఆటోలో మొత్తం 34 మంది రైతు కూలీలు ఉన్నారని స్థానికులు తెలిపారు, ఒకపక్క ఎస్సై అనూక్ ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తుంటే వీరు మాత్రం లెక్క చేయకుండా ఆటోలలో పరిమితి మించి కూలీలను ఎక్కించకుండా, ఎక్కువ మంది రైతు కూలీలను ఆటోలలో ఎక్కించడం వల్ల అనుకోకుండా జరిగే ప్రమాదాలలో ప్రాణ నష్టం కానీ, గాయాలు కానీ అవుతాయి. డ్రైవర్లు నిర్లక్ష్యం చేయకుండా పరిమితికి లోబడి రైతు కూలీలను ఆటోలో ఎక్కించుకోవాలి లేకుంటే తగు పరిణామాలకి దారితీస్తుంది.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 11)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తర్లుపాడు మండలంలోని మిర్జా పేట గ్రామంలో గొలమారి వారి వివాహ మహోత్సవం సందర్భంగా వధువును ఆశీర్వదించారు. తర్లుపాడు మండలంలోని సురేపల్లి గ్రామంలో పానేం వారి వివాహ మహోత్సవం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. మార్కాపురం పట్టణంలోని చెన్నారాయనిపల్లిలో ఆడక వారి వివాహ మహోత్సవం సందర్భంగా నూతన వదు వరులను ఆశీర్వదించారు. మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో చెరుకుపల్లి వారి వివాహ మహోత్సవం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. మార్కాపురం పట్టణంలో సత్య జ్యువలరీ వారి నిశ్చాయ తాంబూలాలకు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కాపురం పట్టణంలో జూపల్లి వారి వివాహ మహోత్సవం సందర్భంగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.







## ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో నీతి కథలు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 11)**

ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం విదార్థులతో ముందుగా నీతి కథలు చదివించి అనంతరం పిల్లలకు చక్కటి చేతి రాత మీద పోటీలు నిర్వహించారు. అనంతరం ఈ వేసవి శిక్షణా తరగతులు మొదలైనప్పటి నుంచి ప్రతి రోజూ పిల్లలకు చదువుతోపాటు వారి మానసిక ఆనందం కోసం వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరిగింది.అప్పటి నుండి ఇప్పటి వరకూ జరిగిన పోటీలలో గెలుపొందిన విజేతలకు మొత్తం 100 బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి బహుమతులుతో పాటు స్నాక్స్, శీతల పానీయాలు ఒక్కరి ద్వారే అందించడం జరిగింది. మిత్రుడు బుడితి సందీప్ పాటిల్ లెక్చరర్, కర్ణాటక, వారి అమ్మ బుడితి ప్రమీల వైఆఫ్ దిలీప్ కుమార్ రిటైర్డ్ టీచర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోడేరు, ఆచంట మండలం పశ్చిమ గోదావరి జిల్లా (స్వగ్రామం నరసాపురం) వారు ఇటీవల స్వర్గస్తులైనారు. జీవితంలో సగభాగం ఒక టీచర్ గా పిల్లల మధ్య గడిపిన ఆ మహా తల్లి ఆత్మకు శాంతి చేకూరేలా అమ్మగారి పేరు మీద కుమారుడు బుడితి సందీప్ పాటిల్ చేతుల మీదుగా అడిగి మరీ తనే స్వయంగా అందించారు. ఇంత మంది పిల్లల ప్రేమకు పాత్రులైన ఆ కుటుంబానికి శాఖా గ్రంథాలయం ఉలవపాడు, ప్రకాశం జిల్లా వారి తరఫున అమ్మగారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని హృదయ పూర్వక అభినందనలు మిత్రమా అని తెలిపారు.





# బీసీ మహిళా మంత్రి పై పోలీసుల తీరును ప్రతి ఒక్కరు ఖండించాలి

**రాష్ట్రంలో మహిళలకు, బీసీ సామాజిక వర్గానికి భద్రత కరువు**
**ఏపీలో రెడ్‌బుక్ పాలన సాగుతుంది**
**వైసీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు హేయం**
**పరిపాలన చేతకాక కూటమి ప్రభుత్వం డైవర్ట్ రాజకీయాలు**
**మీడియా సమావేశంలో వైసీపీ నేతల ధ్వజం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 11)**

బీసీ మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసులు ప్రవర్తించిన తీరు హేయమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా వైసీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఒంగోలు వైసిపి ఇన్చార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి మహిళల పట్ల చిత్తశుద్ధి ఉందంటూ ఒక పక్క ప్రకటనలు చేస్తూ మరోపక్క మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అని కూడా చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గమన్నారు. పాలనలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టించేందుకు డైవర్ట్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గుంటూరు జిల్లాలో ఒక ఎంపీటీసీని అర్ధరాత్రి నైటీపైనే అరెస్టు చేయటం ఓటమి ప్రభుత్వానికి మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. పొగాకు, మిర్చి, ధాన్యం కు గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్లపైకి వచ్చి తమ నిరసనను తెలుపుతున్నారన్నారు. మరోపక్క వ్యాపారులు వ్యాపారాలు లేక అల్లాడుతున్నారన్నారు. ఉద్యోగాలు లేక యువత నడిరోడ్డు పైకి వస్తున్నారన్నారు. ప్రజలు అసంతృప్తితో ఉన్నారని గ్రహించిన కూటమి ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టించేందుకే ఎంతో పలుకుబడి ఉన్న, ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా నిలిచే మాజీ మంత్రి విడుదల రజిని పై అనుచితంగా ప్రవర్తించి సన్సేషన్ క్రియేట్ చేసేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల బెదిరింపులకు వైసిపి కార్యకర్తలు భయపడరని పేర్కొన్నారు. నేలకు కొట్టిన బంతిలా మరింత వేగంగా ఉత్సాహంగా పనిచేస్తారని తెలిపారు. వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధం కన్నా కూటమి ప్రభుత్వానికి వైసిపి కార్యకర్తలు వేధించటం ఎక్కువ ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. శ్రీకాంత్ రెడ్డి పై 15 కేసులు ఎందుకు పెట్టారో తెలపాలన్నారు. తిరిగి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టిడిపి నాయకులకు కూడా తిరిగి ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు మాట్లాడుతూ ఒకవైపు కోర్టులు మొట్టికాయలు వేస్తున్న పోలీసులలో ఎటువంటి మార్పులు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమ తీరును మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు.

వైసిపి కార్యకర్తలు కూటమి ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులకు భయపడరన్నారు. సమావేశంలో ఎంపీపీ సావిత్రి రెడ్డి, భూమిరెడ్డి రవణమ్మ, బడుగు ఇందిరా, కుట్టిపోయిన కోటి, తదితరులు పాల్గొన్నారు.





# రామాయపట్నంలో మాక్ డ్రిల్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 11)**

భారత్ -పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో సుమారు సాయంత్రం ఐదు గంటల సమయంలో గుడ్లూరు మండలం రామాయపట్నం పోర్టులో ఎవరైనా తీవ్రవాదులు వచ్చి ఎటాక్ చేస్తే ఎలా రక్షించుకోవాలి, ఇందుకు సంబంధించి మాక్ డ్రిల్ జరిగింది. ఈ డ్రిల్లులో కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో గుడ్లూరు సర్కిల్ సిఐ మంగారావు, గుడ్లూరు ఎస్ఐ, సబ్ డివిజన్ సిబ్బంది, మెరైన్ పోలీస్ స్టేషన్ సిఐ శివ నారాయణ, వారి సిబ్బంది, గుడ్లూరు ఎమ్మార్వో స్వర్ణ, చేవూరు హాస్పిటల్ డాక్టర్, కందుకూరు ఫైర్ ఆఫీసర్, ఫైర్ ఇంజన్ 108 అంబులెన్స్, కోర్టులో వర్క్ చేస్తున్న సుమారు 100 మంది సిబ్బంది, సమీప గ్రామాల ప్రజలు అందరు పాల్గొని ఏమైనా విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు ఎలా రక్షించుకోవాలని విషయం పై మాక్ డ్రిల్ నిర్వహించారు.







# శ్రీ ఓసూరమ్మ తల్లి ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)**

మనుబోలు మండలం గురివిందపూడిలో గ్రామదేవత శ్రీ ఓసూరమ్మ తల్లి దేవస్థానం ప్రహరీ నిర్మాణానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ముప్పలశెట్టి వెంకటకృష్ణయ్య, ఆడిపూడి కృష్ణారెడ్డి జాపకార్థం రమేష్ బాబు, శ్రీహరిరెడ్డి దాతృత్వంతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. రూ. 14 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం చేపట్టిన దాతలను ప్రత్యేకంగా ఎమ్మెల్యే అభినందించారు. తొలుత ఓసూరమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూరమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.









# డీఈవో చేతుల మీదగా షార్ట్ ఫిలిం విడుదల చేసిన గుంజి నాగభూషణం



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)**

మండలంలోని గండవరం పంచాయతీ హై స్కూల్ హిందీ ఉపాధ్యాయులు నాగభూషణం విద్యార్థులచే షార్ట్ ఫిలిం విడుదల జిల్లా విద్యాశాఖ కార్యాలయం లో చేతుల మీదగా జన్మదిన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఎంతో విద్యార్థులపై హిందీ ఉపాధ్యాయుడు టెక్నాలజీని ఉపయోగించి ఆసక్తికరంగా షార్ట్ ఫిలిం ప్రారంభం చేసి తద్వారా విద్యార్థినీ , విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా అధ్యయానికి తోడ్పడడం ఎంతో సంతోషకరమైన విషయమని కొనియాడారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

**ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి**









**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)**

బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని రెయిన్ బో స్కూల్‌లో నారాయణ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై నారాయణ హాస్పిటల్ వారి ఉచిత వైద్య సేవలు పొందారు. ప్రయివేట్ హాస్పిటల్స్ కు వెళ్లి వేలకు వేలు ఫీజులు కట్టి మెరుగైన వైద్య సేవలు పొందలేని పేదలు నివసించే ప్రాంతాలలో నెలకో సారి ఫ్రీ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చి పట్టణ మున్సిపల్ వైస్ ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, పఠాన్ నస్రీన్ ఖాన్, కౌన్సిలర్ పుట్ట లక్ష్మి కాంతమ్మ, బుచ్చి టిడిపి అర్బన్ మండల అధ్యక్షులు ఎంవి శేషయ్య, రియల్టర్ శ్రీనివాసులు, సుభహాన్, తదితరులు పాల్గొన్నారు.

# వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 11)**

ఉలవపాడు మండలం పెద్దపట్టపుపాలెం గ్రామంలో తూపిలి పోలయ్య గోవిందమ్మ కుమారుడు అంకయ్య, వెంకటలక్ష్మి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు. ఈ కార్యక్రమంలో పెద్దపట్టపుపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాటూరిని పరామర్శించిన ఎంపీ మాగుంట





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 11)**
అనారోగ్యంతో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న పొదిలి మాజీ జడ్పీటీసీ సభ్యులు కాటూరి నారాయణ బాబును ఆదివారం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అవులూరి యలమంద, ఉలవ గోపి, కంచర్ల రమేష్, తదితరులు ఉన్నారు.

# తాగునీరు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 11)**
ఒంగోలులోని మానిటింగ్ చైర్మన్ దామచర్ల సత్య కార్యాలయం నందు కొండపి నియోజకవర్గ ఆరు మండల ఎంపీడీవోలు , ఎంఆర్వోలు, ఇతర అధికారులతో సత్య సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల్లో తాగునీరు, మౌలిక వసతులు ,కొత్త రేషన్ కార్డులు ,కొత్త పింఛన్‌దారులు అర్హులైన ప్రతి ఒక్కరికి తెలియజేసి నూతన రేషన్ కార్డులు ,పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# శ్రీ పెనుశీల లక్ష్మి నరసింహా స్వామి దర్శనార్థం వెళ్లే భక్తులకు రాపూరు మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదానం



**(షణ్ముఖ వెలుగు, దక్కిలి, మే 11)**
పెంచలకోన బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రీతి పాత్రమైన రోజు నృసింహ జయంతి సందర్భంగా శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. దీంతో దారిపొడవునా పలువురు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రాపూరు- పెంచలకోన జాతీయ రహదారి ఎర్రచెరువు వద్ద ఉన్న మామిడి చెట్టు కింద రాపూరు మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బస్సులు, ఇతర వాహనాలదారులకు, భక్తులకు మిత్ర మండలి సభ్యులు పెరుగు అన్నం,సాంబారు అన్నం అందజేశారు. మరికొందరు గ్రామస్తులు అన్నదానం చేస్తుండగా మరికొందరు తాగునీరు, మజ్జిగ అందించి స్వామి వారిపై ఉన్న తమ భక్తిని చాటుకొన్నారు.

# చెవులు వినబడే వరకు అమ్మ అనే పదం







**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 11)**
చూపు ఉన్నంతవరకు అమ్మ కంటి నిండా మన రూపం. మనకి జీవం ఉన్నంత వరకు అమ్మ కు మన చేతి స్పర్శ జనసేన ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు. కొడుకు గొప్పవాడు అవ్వాలి ఎంత గొప్ప అంటే దానికి అంతే లేదు...అంతులేని ప్రేమను పంచుతున్న మహిళా మాతృ మూర్తులందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు. మాతృ దినోత్సవ సందర్భంగా గత 14 రోజులుగా చిల్డ్రన్స్ పార్క్ సందు నెల్లూరు సిటీ డొక్కా సీతమ్మ పేరుపై ఉచితంగా మజ్జిగ పంపిణీ కేంద్రం వద్ద జనసేన పార్టీ వీర మహిళ విజయలక్ష్మి గునుకుల ఆధ్వర్యంలో పలువురు మాతృమూర్తులకు సత్కరించి కొంతమంది తల్లులకు ఉచితంగా చీరలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కిషోర్ గునుకుల మాట్లాడుతూ.. 90లో చిన్నప్పుడు వడగళ్ల వాన వచ్చింది. పెంకుటిల్లు పెంకులన్నీ లేచిపోయాయి. నాన్న ఇంట్లో లేడు . ముగ్గురు పిల్లల్ని ఓ మూలకు చేర్చి మంచం అడ్డం పెట్టి దాని మీద దుప్పటి కప్పి మా అమ్మ అడ్డంగా నిలుచుంది.

**అమ్మ అంటే ఇదే...** ఈ విషయం మా గుండెలో నా మైండ్లో ముద్రించుక పోయింది. అంతులేని ప్రేమను పంచుతున్న అమ్మలకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు. తన జీవితంలో పొందని వాటిని బిడ్డలకు సమకూర్చి వారి నుంచి ఏమీ ఆశించని జీవి ఒకటి ఉందంటే అది అమ్మ ఒక్కటే. అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గారి దయవల్ల నాలుగు సంవత్సరాలు నుంచి ప్రజాసేవలో బిజీగా ఉన్నప్పటికీ బరువైన బాధ్యతని నాతో మోస్తున్నాను అదే మా అమ్మ ప్రేమ. కొడుకు గొప్పవాడు అవ్వాలి ఎంత గొప్ప అంటే దానికి అంతే లేదు...అంతులేని ప్రేమను పంచుతున్న మహిళా మాతృ మూర్తులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ తల్లులను చూసుకోవాల్సిన బాధ్యతను బిడ్డలకు గుర్తు చేస్తూ ఈ రోజు మాతృ దినోత్సవ వేడుకలు జరపడం జరిగింది. పిల్లల్ని వదిలేసిన తల్లులు చాలా అరుదుగా చూస్తుంటాం...తల్లులను వదిలేసిన పిల్లలను చాలా ఎక్కువగా చూస్తున్నాం. ముఖ్యంగా మన నుంచి ఆశించే ఈ మూడే... మాట వినబడే వరకు అమ్మ అనే పదం చూపు ఉన్నంతవరకు కంటి నిండా మన రూపం..జీవం ఉన్నంతవరకు మన చేతి స్పర్శ.... ఇవన్నీ వీలైనంత తరచుగా అందేటట్లు చూడండి....అది మన బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ...అందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు... అమ్మ అనే పదం ఎంత తినేదో నేను అమ్మాయి అయ్యే వరకు తెలియలేదు. ప్రతిక్షణం బిడ్డల క్షేమాన్ని కోరుకునే తల్లులు దైవరూపాలు అని చెప్పుకోవడంలో అతిశయోక్తి తెలియదన్నారు.

ఈ రోజు జనసేన పార్టీ వేదికగా పిల్లల కోసమే బతుకుతున్న ఎంతోమంది తల్లులను గుర్తు చేసుకుంటూ పిల్లలు అందరు కూడా ఎంత బిజీ గా ఉన్నా మీ తల్లుల్ని పలకరించండి, కలవండి... మీ ప్రేమని వ్యక్తపరచండి. తన కష్టాలను మర్చిపోయి మన ఇష్టాలను గౌరవిస్తూ మన అభివృద్ధి కోరుకునే తల్లులందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళ విజయలక్ష్మి, శ్యామల,లక్ష్మీ కుమారి,పసుమర్తి సుజాత,చల్లా కవిత,గల్లా కవిత,దూబిశెట్టి కళ్యాణి,గాయత్రి,లక్ష్మీ కుమారి,సుగుణ, సునీత,శిల్ప, రజిని,జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి,జిల్లా కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, నెల్లూరు సిటీ నాయకులు గుర్రం కిషోర్,అనుదీప్,పేనేటి శ్రీకాంత్ తెలుగుదేశం నాయకులు శ్రీనివాసులు, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

# డోనార్స్ క్లబ్ సభ్యుల సంఖ్యను గణనీయంగా పెంచాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 11)**
ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం 1కే డోనార్స్ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశం ఒంగోలు బృందావనం ఫంక్షన్ హాలు నందు చాలా ఘనంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ 1కే డోనార్స్ క్లబ్ సభ్యుల సంఖ్యను రాబోయే రోజుల్లో గణనీయంగా పెంచాలని, ఈ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు రాష్ట్రంలోని అన్ని కమ్మ సంఘాలు ఆదర్శంగా తీసుకునే విధంగా ఉండాలన్నారు. ఈ క్లబ్ ప్రధాన ఉద్దేశ్యం ఎవరైతే ఆర్థికంగా వెనుకబడి చదువుకోలేక ఇబ్బంది పడుతున్నారో వారిని గుర్తించి ప్రోత్సహిస్తామని అన్నారు.

విద్య, వైద్యం స్వయం ఉపాధి క్రీడలు వంటి అంశాలకి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యా, వైద్య, వ్యాపార. ఉద్యోగ రంగాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, బెల్లం కోటయ్య, కామని చిన బాబు, భగీరథ కెమికల్స్ జనరల్ మేనేజర్ లింగమనేని వెంకట రామయ్య చిడిపోతు వెంకటేశ్వర్లు, పోతినేని శ్రీనివాస రావు, గోరంట్ల రవికుమార్, అలా హనుమంతరావు కాట్రగడ్డ రఘుపతి రావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, రావుల పద్మజ, వివి సుజాత డాక్టర్ నామినేని కిరణ్, మన్నం శ్రీనివాస్, మండవ సుబ్బారావు, పావులూరి బాపయ్య, పోతినేని శ్రీనివాసరావు, (పియస్ఆర్), చౌదరి టీం లీడర్లు, క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.








On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com